# ఒంటరి

## వి.వి.బి.రామారావు



"అమ్మాయ్ ! తొమ్మిదయిపోయి నట్టుంది.... అల్లుడు ఇంకా రాలేదు... ?"

"వస్తారులే నాన్నా! నువ్ పడుకో!"

"తలుపు వేసుకోడం మరిచి పోకుసుమా.... నాకు తెలియకుండానే మాగన్ను పట్టేస్తుంది."

"ఫరవాలేదులే.... ఈ వీధిలో అల్లాంటి భయాల్లేవు!"

బయట వరండాలోకి చాపతెచ్చి వేసుకుని గాజుగ్లాసులో పక్కన నీళ్ళు పెట్టుకుని నీళ్ల మీద పొస్చుకార్డు మూతగా పెట్టుకుని నిద్రకు ఉపక్రమించాడు నిరంజన శర్మ.

అదేమి ఖర్మమో కాని కష్టపడితేనే కాని నిద్రరాదు. ఎందుకు నిద్రరావడం లేదా అని ఆలోచిస్తున్న కొద్దీ ఆలోచనయితే పదునవుతుందే కాని నిద్రమాత్రం రాదు.

కష్టపడితే కదా నిద్రవచ్చేది. కాయకష్టం తనని చెయ్యగలిగిన వైనా చెయ్యనియ్యరు.

"నీకేం, మహరాజులా ఉండక!" అంటాడు పెద్దవాడు.

"బోల్డు పుస్తకాలున్నాయి నాన్నా!.... ఉపనిషత్తులు కనపడ్డవన్నీ కొని పడేశాను... కాలు మీద కాలు వేసుకుని చదువుకుంటూ కూచోక బూజులు దులుపుతూ, దొడ్డి కడుగుతానంటావేం?" అంటాడు చిన్నవాడు. వట్టి వెర్రి బాగులాడు!

అయినా ఆడది లేని బతుకులో వెలితి మరొకరికి అర్థమయ్యేలా ఎలా చెప్పడం?

కాలం మీద పడి కాబళించడానికి సమీపిస్తున్న కొద్దీ ఆడదాని అవసరం రోజు రోజుకీ హెచ్చుతూనే ఉంటుంది.

కాని కాలం తనకోసం తనకి కావాల్సిన దాన్ని నిలిపి ఉంచుతుందా?

నేవచ్చిన పనిఅయిపోయిందిలే అన్నట్టు సీతాలు కనీసం నిట్టూర్పైనా విడవ కుండా దిగ్గున లేచి మటుమాయమైపోయింది.

–"మీరు చాపమీద పడుకోలేరండి!" అనేది సీతాలు వెర్రి సీతాలు!

–"గబ్బిలం చీకటినే వెదుక్కుంటూ పోతుంది!"

ఈ మాటలు చెవిని బడడంతో చటుక్కున నిరంజన శర్మకి పడబోతున్న మాన్ను చెదిరిపోయింది.

–"నా పరువు తియ్యడానికి కాకపోతే ఇంత ఇల్లూ వదలి బయట వరండాలో పడుకునే అవసరం ఏమొచ్చింది?"

అల్లుడికి కోపం. ఏదో ఆవేశం.

గబ్బిలం? ఎవరు? తనే? ఈ మాట అన్నదెవరూ? తనబిడ్డే!

–"నాన్నా! నాన్నా!..... పట్టు పావడాకుట్టించు-నాన్నా! అమ్మా, పూలజడకుట్టవే.... " అన్న తన ముద్దుల పాపాయే?

కట్నం వద్దు నాన్నా కట్నం ఇచ్చే పద్ధతిలో నేను అసలు పెళ్ళే చేసుకోనునాన్నా! అన్నయ్య లిద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యాయికదా! నువ్వు వాళ్ళదగ్గరకి వెళ్ళకు.. నాదగ్గరే ఉండిపో.... నా జీతం మన ఇద్దరికీ చాలక పోదు.... ఇంత చదువు చదివించావ్.... ఉద్యోగం చేసుకుంటున్నాను.... నాకు కట్నం కూడా ఎందుకిచ్చి పెళ్లి చెయ్యాలి నాన్నా!"

వెర్రి తల్లి..... ఈ రోజుల్లో కట్నం లేకుండా పెళ్ళిళ్ళు జరిగేనా? జరిగినా ఎంత కాలమో సాఫీగా వెళ్ళేనా?

చేసింది చిన్న ఉద్యోగమే అయినా రిటయిరు మెంటు తరువాత ఏవో కొన్ని డబ్బు లొచ్చాయి... పిల్లలూ వచ్చారు. సీతాలు లేని లోటు కనపడ-నియ్యకుండా వదినలిద్దరూ తమ ఆడబడుచు పెళ్లి చేయించేశారు.

తల్లి లేని లోటు కనపడనియ్యలేదని కూతురు అన్నప్పుడు ఎంతో సంతోషం వేసింది ఆరోజు! కాని

మరో టి అనిపించింది... ఈ ఒక్క సంవత్సరం సితాలుని మృత్యువు తిసుకెళ్ళిపోకుండా ఉంటే ఎంత బావుండేది అని

మృత్యువు తనమిద నేరం ఉంచుకోదు... అయ్యో గుండెపోటనో – కారుకిందపడ్డాడనో – కేన్సర్ వచ్చిందనో... ఏవో లా మనచేత నమ్మిస్తుంది...

ఒకరు కోరితే వచ్చేదా? ఒకరు వారిస్తే ఆగేదా? దానిలక్షణం అది - పోవాలంటే తను పోవాలంటె తను పొగలుగుతున్నాడా? సితాలుకి పోవాలని ఏకోశాన్నయినా ఉండేదా?

పిల్ల పెళ్ళికి పట్టుచీర కొనుక్కుంటానని అంటూనే ఉంది. పెళ్ళికి సంవత్సరంముందే ఉన్న చీరలే వదలి వెళ్ళిపోయింది.

మనిషి ఎలాగయినా ఒంటరివాడే... ఎవరితోనూ కలసి రాడు – కలసి వెళ్ళడు... ఇక ఈ బతుక్కి గమ్యమా? అది ఎవరికి వారు వెదుక్కోవలసిందే !?

ఇంతకి పిల్ల రమ్మందంటూ అల్లుడు కార్డు రాస్తేనేగా తను ఇక్కడికి వచ్చాడు!

గాజు గ్లాసుమిద పెట్టుకున్న పోస్టు కార్డు అల్లుడు రాసిందే. మరి గబ్బిలంలా చీకటిని వెతుక్కుంటూ వచ్చాననుకుందేవిటి వెర్రి మొహం!

"నాన్నా, చెల్లాయి రమ్మంటోందట... ఈ వందా ఖర్చులకి ఉంచు.." అన్నాడు చిన్నాడు.

ఇప్పుడు తను తను కనుక్కున్న వాళ్ళందరినీ పుస్తకం చదివేసినట్టు చదివెయ్యగలడు. వాళ్ళు మాటాడనక్కరలేదు. వాళ్ల మెదడులోని ఆలోచనలు వాళ్ల కళ్ళలోంచి ముఖం రంగుల్లోంచి, పాత చర్మకమైన అద్దంలోంచి కనపడే వస్తువులాగె స్పష్టంగా కనపడిపోతాయి.

అయినా తనెందుకు బ్రతికి ఉండాలి?

ఏమో! తనకయితే నిజంగా బ్రతకాలని లేదు. కాని చావంటే ఏదో భయం! ఎంత తెలిసినా, ఎంత తెలుసుకున్నా ఇంకా భయమే! ఇంకా చిన్నతనమే! ఇంకా అజ్ఞానమే

తనని తాను తెలుసుకోడానికా ఈ ఒంటరితనం" నాది నాది అన్నది నీదుకాదురా బాబూ అని ఎన్నోసార్లు ఎంతోమంది చెప్పారు. మరి తనదికాదని తెలిసినా పిల్లని చూడడానిక ఎందుకొచ్చాడు?

తన కడుపున పుట్టిన పిల్ల తనని గబ్బిలం అని ఎందుకంది"

పిల్లలందరూ తనని అసహ్యించుకుంటున్నారు. తను ఎవరికి అక్కరలేదు వాళ్ళకిదూరంగా తను ఉండలేడు. కాని తను ఎక్కడకయినా వెళిపోతే బాగుంటుందను కుంటారు వాళ్ళు.

తను పొరపడుతున్నాడా? కన్నతండ్రిమిద ద్వేషం ఎందుకుంటుంది? తనేసరిగా పిల్లల్ని అర్థంచేసుకోలేక పోతున్నాడా?

చిన్న దానికి జబ్బు చేసింది. డాక్టరు రాత్రి గడవడం కష్టమని చెప్పేశాడు. కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరాడు.

సీతాలు కంగారుగా ఉంది. సాయంకాలమే మితా పిల్లలందరికీ ఇంతచారూ అన్నం వండి పడేసింది.

సీతాలూ, తనూ బిడ్డ వంకే చూస్తూ కూచున్నారు. దీపం వెలుగుతుంది.

"ఫరవాలేదుటండి పక్కింటి బామ్మగారి కొడుకు డాక్టరు... ఆవిడ గంపెడు పిల్లలతల్లి... ఆవిడ వచ్చి చూశారు.... దేవుడికి మొక్కుకున్నాను కూడా! వెనక వీధిలో శరభయ్యగారు ఏవో శ్లోకాలు లిస్తారట్ల... మహాలక్ష్మమ్మ వెళ్ళి కట్టించి పట్టుకొచ్చింది.

సీతాలు ఉత్సాహంగా చెబుతోంది.

నిజమే! బ్రతుకుతుందేమో! డాక్టరు మాత్రం దైవజ్ఞుడా, గతా గతాలు చెప్పడానికి... మందు వేస్తూనే ఉన్నారుగా! పిల్ల బ్రతుకుతుందేమో!... దేనికయినా నమ్మకమే ప్రధానం... నమ్మకమని భొత్తిగా గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారం అని తను అనడంలేదే?

నమ్మకంతో కొండలు కదల్చగలమని పెద్దవాళ్ళు చెబుతారు. పెద్దవాళ్ల మాటలు ఊరికేపోతాయా?

అనలేదు.


ఇంటెడు చాకిరిచేసి తను వచ్చేసరికి నవ్వుతూ నిండుకుండలా ఉండేదే? కోడళ్ల నెవరినీ ఏమి అని ఎరగదే?

అందుకేనా కోడళ్ళకి తనంటే కోపం?

ఇక తనపాపమా అంటే తనుచేసే తాలూకాఫీసులో చిన్న ఉద్యోగంలో పాపం చెయ్యగలిగిన స్థితి తనకుందా? పూట బత్తెం, పుల్ల వెలుగూ బ్రతుకుల్లో పాపాలు చెయ్యడానికి ఆస్కారమొకటా?

పెద్దవాడు కాదన్నప్పుడు చిన్నవాడి దగ్గరకో, చిన్నవాడు వెళ్ళునాన్న అంటే పెద్దవాడి దగ్గరకే, ఇంకా పరిస్థితి బాగులేకపోతే – పిల్లని చూడాలనిపించినపుడు ఆడపిల్ల దగ్గరకో అలా తిరుగుతూ కాలం వెళ్ల మార్చుకుంటూనే ఉన్నాడు తను.

ఏమిటో ఈ మమతలు? ఈ బంధాలు?




రాత్రంతా మృత్యుంజయ జపం చేస్తూనే ఉన్నాడు. ఎప్పుడు పడిందో ఏమో మాగన్ను పడిపోయింది.

తెలివి వచ్చేసరికి ఇదేమిటండి ఇంకా దీపం వదిలేశారు!" అంటూ పెద్దవాడు వచ్చి దీపం ఆర్పేశాడు.

సీతాలు ఘొల్లుమంది. బిడ్డ నిద్రలో మూసిన కళ్ళ విడిపోయాయి.

రాత్రి డాక్టరు చెప్పినమాట సీతాలుకి చెప్పి ఉంటే? అది నమ్మకంతోనే ఉంది... తనలోనే నా నమ్మకం లోపించింది.

తల్లితండ్రుల పాపాలు బిడ్డలని కట్టి కుడుపుతాయంటారు.

పాపం సీతాలు ఏం పాపం చేసింది?ఇంటిల్లిపాదికీ చాకిరీ చేసింది. అత్తగారికి ఆడబడచులకి చేసి చేసి ఒళ్ళు గుల్ల చేసుకుంది. శతవిధాల చేసినా ఎప్పుడూ ఎవరిని పల్లెత్తుమాట

నావికాపని తెలియకున్నా తెగెనికాపు. ఒక్కొక్కసారి గుంటకాకుల మిద కోపమూ వస్తుంది. కాని అది తాటాకు మంట, నిలబడదు.

కుదురుగా ఒక దగ్గర ఉండదని తనమిద అపప్రధ. నింద... కాని ఎలా?

తనంటే బరువు అనిపిస్తున్నప్పుడు మరొక దగ్గరికి వెళ్ళక ఏం చెయాలి? బయటికి పొమ్మంటుంటే చూరుపట్టుకొని వేళ్లాడడం ఎలా?

అల్లుడి వ్యవహారం బాగున్నట్టులేదు.... ఉదయం తొమ్మిదికి లేచి ఒక్క అరగంటలో వెళ్ళిపోతాడు. రాత్రి పదకొండు, పన్నెండో.. అతని దయ.. పిల్ల ఇటు ఉద్యోగమూ, అటు సంసారమూ.

బయటికి ఏమి చెప్పదు. గుంభన! కాని తనకి తెలిసిపోయింది.

తండ్రిని తిడితే మొగుడు మెచ్చుకుంటాడనో,

తంద్రి మీద విసుక్కుంటే మొగుడు మెత్తపడతాడనో అనుకుంటున్నట్టుంది. వెర్రికోన!

కాని సరియైన సమయంలో ఆడది మేలుకోకపోతే ఇల్లూ ఒల్లూ అంతా గుల్లే.... ఇంకేమయినా ఉందా? కాని ఈ మాటలు దానికి చెప్పడం ఎలా? నీ బోడి సలహా ఎవడిక్కావాలి అని ముఖం మీద అనేసినా అనేస్తుంది.

నాలుగున్నరకే తెలివి వచ్చింది.

కాని ఏం ప్రయోజనం? తలుపు లోపలికి గడియవేసి ఉంది. తలుపు కొట్టడానికి మొగమాటం!

నిద్ర లేకుండా అలా చాపమీద దొర్లుతూనే ఉన్నాడు.

ఏడవుతూంటే పనిమనిషి వచ్చి తలుపుకొట్టింది. ఆమె గుమ్మం కడుగుతూ ఉంటే తను లోపల కెళ్లాడు.

అల్లుడు గురకపెట్టి నిద్రపోతున్నాడు. పిల్ల లేచి పెరట్లోకి వెళ్ళినట్టుంది.

మెల్లగా దంత ధావనాదులు ముగించుకొని వీధి గుమ్మంలో కూచుని పేపరు చదివి ఎనిమిది దాటిన తరువాత అన్నాడు

"ఆ సంచి ఇలా పడేయమ్మా! కూర తెచ్చి పడేస్తాను.."

సంచి చిన్నగా మడిచిపెట్టి పట్టుకుని కూరకి బయలుదేరాడు నిరంజనశర్మ

పెద్దవాడి దగ్గరనుంచి ఉత్తరమేలేదు. చిన్నవాడి కూతురికి జలుబు తగ్గిందో లేదో! తాత. తాత! అని ఒక్క నిముషం వదలదు - చంటమ్మ.

ఆసుపత్రి దిగువ రోడ్డులో జనం చిక్కపడుతున్నారు వచ్చేవాళ్ళూ, వెళ్ళే వాళ్ళూ - డాక్టర్లు, నర్సులు - రోగులు - ఉద్యోగులు, వ్యాపారులు - ఎవరి హడావుడి వాళ్ళది.

జార్జిరాజు ఆసుపత్రి పెద్ద గేటు దగ్గరకొచ్చాడు నిరంజనశర్మ

గేటులో నుంచి బయటికి నాలుగు సైకిలు చక్రాలు అమర్చబడ్డ తోపుడు బండి వచ్చి దిగువ రోడ్డు వంక మళ్లింది.

# ఒంటరి

ఒకే ఒక ఊదొత్తి వెలుగుతోంది. తెల్లటి మురికి బట్ట ఒకటి కప్పి ఉంది. లోపల ఉన్నదేమిటో వెంటనే అర్థమైపోయింది. ఎవరిదో శవం.

ఎవరో పాపం! అనామకుడన్న మాట ... పేరు తెలియని గమ్యానికి బయలుదేరడం కోసం చావుల మయం దగ్గరికి వెళుతున్నట్టున్నాడు ...

అక్కడ బయలుదేరితే ఎక్కడికెళతాడు?

బొత్తిగా బండి వాడు తప్ప మరో మనిషే లేనంత దీనుడా? ఏ ప్రేమ సమాజం వాళ్లో - దివ్య సమాజంవాళ్లో దహనం చేస్తారేమో!

లేకపోతే శవాల వ్యాపారం ... ఎక్కడో చదివాడు. ఇంత బాహాటంగా ఇలాగా ... నిరంజనశర్మకి మతిపోయింది. ఉదయం 9 గంటల వేళ -ఇంతమంది చూస్తూ ఉండగా ఎంత దిక్కులేని వాడయితే మాత్రం .

పాపం చనిపోయిన మనిషి - ఆడో? మగో? ఎక్కడి మనిషో?

బండి జోరుగా సాగిపోతోంది .. దాన్ని వెనక్కి లాగి పట్టుకోడం బండి నడుపుతున్న మనిషికి కష్టమైపోతోంది.

ఖస్సుమని బ్రేకుల చప్పుడు.

కళ్ల ముందు తెల్లటి తెర ...

"షాక్! ఏమిటేమిటో మాటలు ... ఏదో వాసన ... పెట్రోలా? .. కాదు ఏదో తియ్యటి వాసన ... డెలీరియమ్ .. ఏమిటో అది ... తనూ మాటాడుతూనే ఉన్నాడే ... ఆ మాటలు ఎవరికి వినపడటంలేదు ... డెలీరియమ్ అంటే .. ప్రేలాపన ... జ్వర తీవ్రతవల్ల వచ్చే వాగుడు ... వెర్రివాడు, తన సంచి ఏమయింది?ఎక్కడ పడేశాడో? ... తన కళ్ల ముందు ఇంత వెలుగు ఇలా జిగ్గున మెరిసిపోతూ వుంటే తను వెలుగుపుంతలోకి ముందుకు రివ్వున సాగిపోతూ వుంటే అతన్ని చూసి ఎవరూ ఇంతలా జాలిపడుతున్నారు?

ఇంతకీ తను ఎక్కడ ఉన్నాడు?

"పేరు ఎలా తెలుస్తుంది? ..."

"గుర్తు తెలిపే కాగితాలు ... జేబుల్లో ..."

"జేబులో పర్సులో ఎనిమిది రూపాయల డెబ్బై పైసలున్నాయి ..."

"మరెలా తెలుస్తుంది?"

-"తనెవరో వీళ్ళకి తెలియడంలేదూ? నా పేరు నిరంజనశర్మ ... నన్ను మీరెరుగరూ ... భలేవాళ్ళే? ... తనని మాటాడనివ్వరేం? వినిపించుకోరేం? ... తనెవరో తనకే తెలియని క్షణాలు జీవితం ఎదుర్కొనక పోలేదు. కాని ఇప్పుడు తనెవరో తనకి ఖచ్చితంగా... క్షుణ్ణంగా తెలుసు ..

మరి వీళ్లెవరూ? మాటలంటే వినపడుతున్నాయి కాని మనుషులు కనపడరేం? తన కళ్లజోడు ఏమయింది! పెద్దాడి కొడుకు వెధవ నాగన్న దాచేశాడు? .. అంతర్ కుసుమల్లె సోడాబుడ్డి అద్దాలొచ్చాయి ... వాడికి ఆట ... తనకి ప్రాణం పోకట ... ఇవ్వరా వెధవకానా - నా కళ్లద్దాలతో నీకు ఆటేమిటి?

-"పాపం ఎవరో ఒంటరి వాడేమో! . దిక్కులేని వాడులా ఉన్నాడు!"

"ఇదేమిటి, తనకి దిక్కు లేక పోవడమేమిటి? చెబితే వినిపించుకోరేం? .. ఒరేయ్ వెధవాయులూ, నాకు ఇద్దరు మగపిల్లలు - మహారాజుల్లా ఉద్యోగాలు చేసుకుంటున్నారు . కూతురు హాయిగా సంసారం చేసుకుంటోంది. దిక్కులేనివాణ్నని నన్ను ఈసడించుకోకండి...

ఎక్కడి నుంచి చెప్మా సీతాలు గొంతు వినపడుతున్నట్టుంది! వస్తున్నానే సీతాలూ! నీ దగ్గరికే బయలుదేరాను దోవలో మల్లెపూలూ కొన్నాను .. అయితే సంచి ఏది . సంచిలో ఉన్నాయిలే . ఇదేమిటి, ఈ చీకటి? . ఇంత వెలుగు . ఎక్కడికి పోయింది?

చీకటిలో తను ఎలా చూడగలుగుతున్నాడు? చీకటిని వెతుక్కుంటూ గబ్బిలం వెళ్లగలదా? చీకటిలోకి వెళ్లడమూ అంటే వెలుగులోంచే కదా? మరి గబ్బిలానికి వెలుగులో కళ్లు కనపడతాయా?

ఎవరి గబ్బిలం? అసహ్యంగా పెద్ద రెక్కలు - అదో రకం వాసన ... చిన్న ముఖం .

ఎవరు గబ్బిలం? తనా?

కాదు ... అల్లుడేమో! లేకపోతే తనని తనే గబ్బిలం అనుకుందా పిల్ల?

ఏమిటి పొగ? ఏమిటీ వాసన! . చిన్న కాంతి కిరణం. చుట్టూ చిమ్మచీకటి. కాంతి వైపు వెడుతున్నాడు తను చిన్న సందులో నుంచి సందు గోడలు అటూ ఇటూ తగులుతూనే ఉన్నాయి ఇంకెంత దూరం నడవాలి? ... సందుకి తరుగూ విరుగూ కనపడడంలేదు . అదిగో వెలుగు .. సారంగం అయిపోయింది. తను వెలుగులోకి వచ్చేశాడు. . వెలుగు . వెలుగు .. వె.. లు ..."

-"శివ, శివ! ఎవరో ఒంటరి మనిషి! గుర్తు తెలుసుకోడానికి ఆచూకీ కూడా లేదు . . కారు కింద పడ్డాడు .."

తెల్లటి బట్ట ముఖం మీద నుంచి కప్పుతూ తెల్ల దుస్తులావిడ నిట్టూర్చింది □

